# బైండ్ల కథ

ఈ కళాకారులు బైండ్లకులానికి చెందినవారు. కాబట్టి వీరు చెప్పచున్న కథలకు బైండ్లకథ అని పేరు వచ్చింది. ఆంధ్రప్రాంతంలో జమడిక అనే వాద్యాన్ని వాయిస్తూ కథలు చెబుతారు. వీరు జమిడికమీద పాట పాడుతారు. శృతి ఉంటుంది. జేగంట ఉంటుంది. బృందంలో ముగ్గురు కళాకారులుంటారు. వీరు చెప్పే కథలు బుర్రకథల మాదిరిగా ఉంటాయి. వీరి కథాగానం బాణీలు వీధిభాగోతం బాణీలు మాదిరగా ఉంటాయి. వీరు ఆంధ్రదేశమంతటా ఉన్నారు.

వీరు గౌడజాతులవారి ఇళ్లలోను, మాలల ఇళ్లలో కొలుపులు కొలుస్తారు. వీరు మాదిగల యిళ్లలో దేవి పూజలు చేస్తారు. పంబ వాద్యంతో వీరు దేవి కథ చెబుతారు. అంకాళమ్మకథ, మారెమ్మ కథ, మాతంగిపుట్టుక, మాతంగి పెళ్లి, ఎల్లమ్మ కథ, మాంధాత కథ, దశ కంఠరాముని కథ మొదలైన గాథలను గానం చేస్తూ ఉంటారు.

వీరు చెప్పే ఎల్లమ్మ కథే పరశురామునికథ. తండ్రి ఆజ్ఞ మేరకు తల్లి రేణుకా దేవి తలను పరశురాముడు గొడ్డలితో నరకుతాడు. తాను చెప్పినట్లుచేసిన కుమారుని వరం కోరుకొమ్మనగా తల్లిని బ్రతికించమని కోరుకుంటాడు. గొడ్రాళ్లకు సంతానం కలిగించే దేవతగా ఎల్లమ్మ దేవతను కొలవడం పల్లెలో ఆచారం. కాకతీయుల కాలంనాడే ఈ జానపద కళాకారులు "ఎల్లమ్మ కథ" చెబుతున్నట్లు శ్రీనాథ మహాకవి రచించిన "క్రీడాభిరామం" అనే గ్రంథములో ప్రస్తావించబడింది.

వీరు రాయలసీమ ప్రాంతంలో "పెద్దమ్మ" కథ చెబుతున్నట్లు తెలుస్తోంది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలో బ్రాహ్మణుల యిళ్లల్లో బైండ్లవారు "కామేశ్వరి" కథ చెప్పేవారని తెలుస్తోంది.

వీరు చెప్పేకథల నుండి తాతలకాలం నుండి అను వంశకంగా ముఖతః వస్తున్నవే కానీ గ్రంథస్థం కాలేదు. ఈ కథలు చెప్పేవారిని దేవుని పూజారులుగా పేర్కొనబడతారు.